క్లుప్తంగా

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



దరఖాస్తు స్వీకరిస్తున్న కమిషనర్ మల్లికార్జున్

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రజాపాలనలో దరఖాస్తులు ఆహ్వానిస్తోందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. శనివారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో ఐదు, ఆరు వార్డుల్లో దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా దరఖాస్తు ఫారాలు పంపిణీ చేస్తోందని, అర్హులందరూ దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ప్రత్యేక అధికారి భాస్కర్ నాయక్, కౌన్సిలర్లు జ్ఞానేశ్వరి, ఊట్ల వరప్రదీప్ ఉన్నారు.

వైభవంగా మహా మెట్లపూజ



మెట్ల పూజలో అయ్యప్పస్వాములు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని నీరుకుల్ల రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో మహా మెట్ల పూజ కార్యక్రమాన్ని 18వ సారి అయ్యప్పమాల ధరించిన లెక్కల గంగాధర్, తొర్రికొండ తిరుపతి ఆధ్వర్యంలో మెట్లపూజ నిర్వహించారు. మెట్ల పూజలో దీపోత్సవం, వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కేరళ గురుస్వామి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించండి

గోదావరిఖని: సింగరేణి వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ కోరారు. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో డైరెక్టర్లను కలుసుకుని వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలోని అంశాలు ఇవీ..

- ★ రామగుండం రీజియన్ , శ్రీరాంపూర్ ఏరియాలో మంచినీటి సౌకర్యం కోసం ర్యాపిడ్ గ్రావిటీ యంత్రాలు ఏర్పాటు చేయాలి.
- ★ రూ.20 కోట్లు మంజూరైనా ఇప్పటివరకు టెండర్ ప్రక్రియ పూర్తికాలేదు.
- ★ సింగరేణి మెడికల్ బోర్డులో జరిగే అవినీతిని అరికట్టి పారదర్శకంగా మెడికల్ బోర్డు నిర్వహించాలి
- ★ సింగరేణి వ్యాప్తంగా ఉన్న పలు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చర్చించాలి.

కార్యక్రమంలో సెంట్రల్ క్యాంపెనింగ్ ఇన్‌చార్జి వికాస్ కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

వస్తు, సామగ్రి అందజేత



మంథని: మండలంలోని సూరయ్యపల్లికి చెందిన మాదాడి అశోక్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి కుమారులు మాదాడి వేణు, గోపాల్‌రెడ్డి తెలంగాణ ఎన్ఆర్ఐ అసోసియేషన్ ద్వారా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు పలు వస్తువులు విరాళంగా అందించారు. రెండు 32 ఇంచుల టీవీలు, రెండు టేబుల్ ఫ్యాన్లు, 48 కుర్చీలు, రెండు బోర్డులు అందజేశారు. సర్పంచ్ బీమిని పుష్పలత, ఉపసర్పంచ్ రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ ఆకుల కిరణ్, వార్డు సభ్యులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మాక్ పోలింగ్



ఎన్నికల నిర్వహణ అధికారులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని మొగల్‌పహాడ్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రాథమిక స్థాయిలోనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భారత రాజ్యాంగంపై అవగాహన, ఓటు ప్రాధాన్యత, ఓటు హక్కుతో ప్రయోజనాలు, ఓటింగ్ విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం.బి.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

ముత్తారం: మండలంలోని పోతారం జెడ్పీ పాఠశాలలో శనివారం కృషివిజ్ఞాన కేంద్రం జమ్మికుంట డబ్ల్యూడబ్ల్యూఎఫ్, బీసీఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆ సంస్థ ప్రతినిధులు చెలుకల యుగేందర్, రాజశేఖర్ వ్యవసాయ పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం లక్ష్మీరాజం పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందేనా?

- పూర్తిగా శిథిలావస్థకు చేరిన సాగునీటి కాలువలు
- శాశ్వత పునరుద్ధరణకు నోచుకోని వైనం
- మరో రెండురోజుల్లో ఎస్సారెస్పీ నీటి విడుదల



27ఎల్ వద్ద కూలిపోయిన ఎస్సారెస్పీ కాలువ

రామగుండం: మరో రెండురోజుల్లో యాసంగి సీజన్‌కు ఎస్సారెస్పీ నుంచి సాగునీరు విడుదల కానున్న నేపథ్యంలో నీటిపారుదలశాఖ అధికారులు తాత్కాలికంగా కాలువల పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. కాగా ఇప్పటికే గ్రామాల్లో రైతులు వరినార్లు పోశారు. ఎస్సారెస్పీ కాలువలు పూర్తిగా శిథిలావస్థకు చేరి లైనింగ్స్, ఫ్లోరింగ్ కూలిపోయి, రంధ్రాలు పడడంతో చివరి ఆయకట్టు రైతులు కనీసం నారుకు సాగు నీరందేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నియోజకవర్గంలో 21వేల ఆయకట్టుకు..

ఎస్సారెస్పీ కాలువల కింద రామగుండం నియోజకవర్గ పరిధిలోకి డీ–83 నుంచి ఉపకాలువ 27ఎల్ ద్వారా పాలకుర్తి, అంతర్గాం మండలాలకు సాగునీటి సరఫరా జరుగుతుంది. ఎస్సారెస్పీ కాలువల కింద పాలకుర్తి 9,300, అంతర్గాం 11,800 ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు నీటిపారుదలశాఖ నివేదికలో వెల్లడించారు. కాగా కాలువలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో రికార్డుల్లో పేర్కొన్న ఎకరాలలో 25శాతం ఆయకట్టుకు కూడా సాగునీరు అందకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

సాగునీటి సరఫరా ఇలా..

డీ–83 కింద ఉపకాలువ 27ఎల్ ద్వారా అంతర్గాం, పాలకుర్తి మండలాల పరిధిలోని 24 గ్రామాలకు ఎస్సారెస్పీ కాలువల ద్వారా చివరి ఆయకట్టుకు సాగునీటి సరఫరా అవుతుంది. పాలకుర్తి పరిధిలోని 1ఎల్ ద్వారా రాగినేడు, ఈసాలతక్కళ్లపల్లి, 2ఆర్ ద్వారా బ్రాహ్మణపల్లి, మల్రిపల్లి, రాయదండి, గోలివాడ, అంతర్గాం (టీలాండ్), 3ఆర్ ద్వారా ఆకెనపల్లి, బ్రాహ్మణపల్లి, సోమనపల్లి, ముర్మూర్ చివరి వరకు, 4ఆర్ ద్వారా ఆకెనపల్లి చివరి ఆయకట్టు వరకు, 5ఆర్ ఎగ్లాస్‌పూర్, ఆకెనపల్లి, సోమనపల్లి, పొట్యాల ఆయకట్టు వరకు, 7ఆర్ పొట్యాల చివరి ఆయకట్టు వరకు, 8ఎల్ మద్దిర్యాల, 9, 10ఎల్ కాలువలు మద్దిర్యాల పునరావాస కాలనీలో ముంపునకు గురయ్యాయి.

ప్రభుత్వం దృష్టిసారించాలి



ఎస్సారెస్పీ కాలువలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఫలితంగా కాలువలు ఎక్కడికక్కడ కూలిపోయి, రంధ్రాలు పడి, చెత్తాచెదారంతో నిండి పిచ్చిమొక్కలు పెరిగి సాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఏళ్లుగా కాలువలకు కనీస మరమ్మతు చేపట్టకపోవడం రైతుల దురదృష్టకరం. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిసారించాలి.

– ఐలవేణి భీమయ్య, రైతు, ఆకెనపల్లి

గత పాలకుల వైఫల్యం



గత పాలకుల వైఫల్యంతో ఎస్సారెస్పీ కాలువలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికే రైతులు నాకు కాలువల దుస్థితి వివరించారు. కాలువ స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించాను. రబీ సీజన్ కోతలు పూర్తయ్యాక కాలువలకు శాశ్వత మరమ్మతు పనులు చేపట్టి చివరి ఆయకట్టు రైతుల కళ్లల్లో ఆనందం చూస్తాను.

– మక్కాన్‌సింగ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం

ఈ సీజన్ తర్వాత శాశ్వత మరమ్మతు పనులు

ఉన్నతాధికారుల ఆదేశాలతో 27ఎల్ నుంచి 13 కిలోమీటర్ల దూరం వరకు రూ.3.25 లక్షలతో గండిపడిన కాలువలను మట్టితో తాత్కాలిక పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నాం. మరో రెండురోజుల్లో వారబందీ విధానంతో సాగునీరు విడుదల కానుంది. ప్రస్తుతం సీజన్ పూర్తయ్యాక రూ.50లక్షల వ్యయంతో శాశ్వత మరమ్మతు పనులు చేపడతాం.

– నవీన్, డీఈ, ఎస్సారెస్పీ

మూడోరోజు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్



జ్యోతినగర్: కేంద్రం వద్ద దరఖాస్తుదారులు



రామగుండం: 20వ డివిజన్‌లో..

పెద్దపల్లిరూరల్: ప్రజాపాలనలో స్వీకరిస్తున్న దరఖాస్తుల ఆధారంగా అర్హులందరికీ పథకాల ఫలాలను అందించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం చందపల్లితో పాటు మండలంలోని గుర్రాంపల్లిలో శనివారం నిర్వహించిన సభల్లో మాట్లాడారు. పెద్దపల్లి మున్సిపాలిటీలోని 13, 15వ వార్డుల్లో అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ దరఖాస్తులు స్వీకరణను పరిశీలించారు.

మంథని: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను అదనపు కలెక్టర్ అరుణశ్రీ పరిశీలించారు. జిల్లాలో 2,25,838 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో షెడ్యూల్ ప్రకారం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తు ఫారాలను ప్రజల ఇంటికి చేర్చుతున్నామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునస్వామి పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంటలో దరఖాస్తులు స్వీకరించారు. గ్రామసభను జెడ్పీ సీఈవో శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి రహూఫ్‌ఖాన్, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ సందర్శించారు. ఎంపీడీవో విజయ్‌కుమార్, తహసీల్దార్ మోహన్‌రెడ్డి, సర్పంచ్ కట్కం రవీందర్, ఉపసర్పంచ్ గుమ్మడి సతీశ్, ఆర్ఐ సంధాని పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని గుంపుల, హరిపురం, బీమరిపల్లెలో ఎంపీడీవో సత్తయ్య ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. హార్టికల్చర్ జిల్లా అధికారి జగన్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ యాకన్న పాల్గొన్నారు.

పాలకుర్తి: రాణాపూర్, జీడీనగర్, కుక్కలగూడుర్ గ్రామాల్లో తహసీల్దార్ ఎం.జ్యోతి, ఎంపీడీవో లలిత దరఖాస్తులు స్వీకరించారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మంగపేట, మల్యాల, మొట్లపల్లి, పందిల్ల, మీర్జంపేట, మడిపెల్లి కాలనీల్లో దరఖాస్తులు స్వీకరించారు. ఎంపీపీ నూనేటిసంపత్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, స్పెషలాఫీసర్ ఆదిరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ నాగలేశ్వర్, తహసీల్దార్ జాహెద్ పాషా పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 17, 18 డివిజన్లలో దరఖాస్తులు స్వీకరించారు. కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు.

ముత్తారం: హరిపురం, మైదంబండ గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించారు. మంథని ఆర్డీవో హనుమానాయక్ తనిఖీ చేశారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎగ్లాస్‌పూర్, విసంపేట, పెద్దంపేట గ్రామాల్లో జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి హాజరయ్యారు. 20, 21, 22వ డివిజన్లలో దరఖాస్తులు స్వీకరించారు.

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం 23, 24వ డివిజన్లలో దరఖాస్తులు స్వీకరించారు.

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో ప్రజాపాలన కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి తిరుపతిరావు నిర్వహించారు. ఆరు గ్యారంటీ పథకాలకు 1094 దరఖాస్తులు, నూతన రేషన్‌కార్డుల మంజూరు కోసం 264 దరఖాస్తులు స్వీకరించారు.

సంక్షిప్త వార్తలు

★ అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర

జూలపల్లి: అయోధ్య శ్రీరామ తీర్థ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీరాముని తలంబ్రాలను మండల కేంద్రంలో భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. బీజేపీ నాయకులు సురేశ్‌రెడ్డి, సర్పంచ్ నర్సింహయాదవ్, ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్, జ్యోతిబసు, ప్రదీప్ కుమార్, పొట్టాల మల్లేశం, గన్ను గంగారెడ్డి, బండి స్వామి పాల్గొన్నారు.

★ ఉచితంగా డయాబెటిస్ పరీక్షలు

జ్యోతినగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ది, లయన్స్ క్లబ్ ఆఫ్ ఉమెన్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిస్, బీపీ పరీక్షలు చేశారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లో వైద్య పరీక్షలు చేశారు. లయన్స్ క్లబ్ గోదావరిఖని శతాబ్ది ప్రెసిడెంట్ కంకణాల ముకుందరెడ్డి మాట్లాడారు. ఆరోగ్య పరిరక్షణకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెక్రటరీ బాలసాని స్వామిగౌడ్, దేవినేని శ్రీనివాసరావు, ఏలేశ్వరం చంద్రమౌళి, సాగర్, అమరేశ్వరరావు, ఉమెన్స్ క్లబ్ అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి ఏలేశ్వరం పద్మ, కోశాధికారి కంకనాల శ్రీదేవి పాల్గొన్నారు.

★ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శిగా స్వాతి

గోదావరిఖనిటౌన్: సామాజిక హక్కుల పరిరక్షణ సమితి రామగుండం కార్పొరేషన్ ఏరియా ప్రధాన కార్యదర్శిగా గడ్డం స్వాతిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు చిలుక ప్రసాద్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులు కనుకుంట్ల రమేశ్, కడమండ శ్రీహరి, డాక్టర్ వాసంపల్లి ఆనంద్‌బాబు, మామిడిపెల్లి శ్రీనివాస్, మాతంగి శివరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

★ ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉందాం

మంథని: ప్లాస్టిక్‌తో అనేక అనర్థాలు కలుగుతాయని, ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండాలని అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అంకరి కుమార్ అన్నారు. శనివారం మంథనిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సలీమ్, అధ్యాపకుడు రావుల తిరుమల్ పాల్గొన్నారు.

★ విద్యార్థులకు ట్రాక్‌సూట్ అందజేత

ధర్మారం: మండలంలోని మల్లాపూర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం విద్యాలయంలోని విద్యార్థులకు శనివారం ప్రిన్సిపాల్ గిరిజ ట్రాక్‌సూట్‌లు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరానికి గాను ఆసక్తి కలిగిన విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశానికి జనవరి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీఈటీ, ఉపాధ్యాయులు చిరంజీవి పాల్గొన్నారు.

★ నేత్రదాత కుటుంబానికి అభినందన

రామగుండం: పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన మున్సిపల్ కార్మికుడు సంపంగి దుర్గయ్య ఇటీవల మృతిచెందగా ఆయన నేత్రాలను దానం చేశారు. కాగా మృతుడి కుటుంబసభ్యులకు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు యోగేష్, కేఎస్.వాసు, పాస్టర్ జోసెఫ్ జాయ్ అన్నారు. అభినందన పత్రం అందజేశారు.

★ సివిల్ రైట్స్ డే

ఓదెల: ఓదెలలోని ఎస్సీకాలనీలో సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ లక్ష్మీచిన్నస్వామి పాల్గొన్నారు.

సమ్మక్క జాతర చైర్మన్‌గా అంజయ్య

ధర్మారం: మండలంలోని బొట్లవనపర్తి సమ్మక్క, సారలమ్మ జాతర చైర్మన్‌గా ఆకారి అంజయ్యను ఎన్నికయ్యారు. బొట్లవనపర్తి, బుచ్చయ్యపల్లి గ్రామాల శివారులోని సమ్మక్క జాతర కమిటీ ఎన్నికలు శనివారం స్థానిక గ్రామపంచాయతీలో నిర్వహించారు. కమిటీలో 34 మంది సభ్యులు ఉన్నారు. చైర్మన్ పదవి కోసం ఇద్దరు పోటీపడ్డారు. ఆకారి అంజయ్య, దారవేని నర్సయ్య పోటీపడగా అంజయ్యకు 20 ఓట్లు రాగా నర్సయ్యకు 14 ఓట్లు వచ్చినట్లు ఎన్నికల నిర్వాహకులు రెడపాక శ్రీనివాస్ తెలిపారు. చైర్మన్‌గా అంజయ్య, ఉపాధ్యక్షులుగా దారవేని సాగర్, ఆవుల రవి, ప్రధాన కార్యదర్శిగా ఆకారి అనిల్, సంయుక్త కార్యదర్శిగా నేరెళ్ల నరేశ్, కోశాధికారిగా తాడూరి రఘు, ప్రచార కార్యదర్శిగా రెడపాక లక్ష్మణ్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సర్పంచులు ప్రమీల, కొమురయ్యను ఎన్నుకున్నారు.

ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో బేబీ ఫీడింగ్ క్యాబిన్ ఏర్పాటు



దాతను సన్మానిస్తున్న మేనేజర్, క్లబ్ గవర్నర్

ధర్మారం: ధర్మారం ఆర్టీసీ బస్టాండ్‌లో అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వ్యాపారవేత్త సిరిపురం గంగన్న ఏర్పాటు చేసిన బేబీ ఫీడింగ్ క్యాబిన్‌ను శనివారం ఆర్టీసీ జగిత్యాల డిపో మేనేజర్ సునీత ప్రారంభించారు. అలయన్స్‌క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ జాయింట్ ట్రెజరరీ సిరిపురం సత్యనారాయణ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు డిపో మేనేజర్ తదితరులు వ్యాపారవేత్త గంగన్నను సన్మానించారు. క్లబ్ సభ్యులు సిరిపురం రాజేశ్, ఎలగందుల అశోక్, తాళ్లపెల్లి సురేందర్, కొల్లూరి కిశోర్, సుభాష్, దాసరి శ్రీనివాస్, అమరోజు నారాయణ, తోడేటి మురళీగౌడ్, బైరి చంద్రమౌళి, బొల్లం మల్లేశం, ఆర్టీసీ కంట్రోలర్ రాజునాయక్ పాల్గొన్నారు.

ముందస్తుగా న్యూఇయర్ వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సుల్తానాబాద్: పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి నూతన సంవత్సరంలో విద్యార్థులందరూ అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

గోదావరిఖనిటౌన్: స్థానిక విద్యానగర్ ఏసీపీ–3 అంగన్‌వాడీ కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలను పిల్లలతో జరుపుకున్నారు.

కమాన్‌పూర్: మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో ముందస్తుగా న్యూఇయర్ వేడుకలు శనివారం నిర్వహించారు.

మిల్లర్లు ధాన్యంలో కోత విధించొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: వరిధాన్యంలో మిల్లర్లు కోత విధిస్తే మిల్లులు నడపనివ్వబోమని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంటలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రైతులు అమ్మిన ధాన్యంలో కొర్రీలు పెట్టి మిల్లర్లు కోత విధిస్తే రైస్‌మిల్లులను నడవకుండా చేస్తామని పేర్కొన్నారు. చిన్నకల్వల, ఐతరాజుపల్లి, దుబ్బపల్లి గ్రామాల్లో ప్రజాపాలనను నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ బాలాజీరావు, సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, రమేశ్, శ్రావణ్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, నాయకులు అన్నయ్యగౌడ్, ప్రకాశ్‌రావు, దమోదర్ పాల్గొన్నారు.

అవినీతిరహిత పాలనే లక్ష్యం

జూలపల్లి: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అర్హులందరికీ అమలు చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని తేలుకుంట, వడ్కాపూర్ గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో పేదలు ఇళ్లు కట్టుకునేందుకు అవసరమైన మొరం రవాణా చేసే ట్రాక్టర్లను ఆపవద్దని రెవెన్యూ, పోలీసుశాఖలకు ఎమ్మెల్యే సూచించారు. మట్టిని అమ్ముకునే వారిని మాత్రం ఉపేక్షించవద్దన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం..

ఎమ్మెల్యేగా విజయం సాధించి మొదటిసారిగా మండలానికి వచ్చిన సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. డీఈవో మాధవి, డీసీవో శ్రీమాల, ఎంపీపీ రమాదేవి, మండల ప్రత్యేకాధికారి రంగారెడ్డి, తహసీల్దారు బషీరోద్దీన్, ఎంపీడీవో వేణుగోపాలరావు, సర్పంచులు సొల్లు పద్మ, తిరుపతి, ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ రమేశ్, కత్తెర్ల శ్రీనివాస్, ధూళికట్ట, ఎలిగేడు సింగిల్‌విండో అధ్యక్షులు వేణుగోపాలరావు, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



సన్మానిస్తున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: సింగరేణి రామగుండం డివిజన్–2 జీఎం కార్యాలయంలో పర్చేజ్ డీజీఎంగా పనిచేసిన సూర చంద్రరాజును శనివారం ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉద్యోగ విరమణ పొందిన చంద్రరాజును కుటుంబ సమేతంగా శాలువాతో సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం అబ్దుల్‌సలీం, ఏరియా ఇంజినీర్ నరసింహరావు, డీజీఎం(పర్సనల్) రాజేంద్రప్రసాద్, సివిల్ డీజీఎం ధనుంజయ, ఫైనాన్స్ డీజీఎం వెంకటరామచంద్ర, డీజీఎం(ఐఈడీ) మురళీకృష్ణ సర్వే అధికారి దేశాయ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో..



సన్మానిస్తున్న ఆర్జీ–1 జీఎం శివప్రసాద్

గోదావరిఖని: సింగరేణి ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన నాగమల్ల శివప్రసాద్‌ను శనివారం జీఎం చింతల శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాతో సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో ఏజీఎం(పర్సనల్) సీహెచ్ లక్ష్మీనారాయణ, డీజీఎం(ఆడిట్) రాజం, అధికారి కట్ట శ్రీధర్, ఏఐటీయూసీ అధికార ప్రతినిధి రాజు, పర్సనల్ అధికారులు శ్రావణ్‌కుమార్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి అధికారికి సన్మానం



సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రామగిరి: సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైన ఎస్ఎస్‌వో లక్ష్మీనారాయణ ను శనివారం టీబీజీకేఎస్ ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, నాయకులు ఘనంగా సన్మానించారు. సీనియర్ సెక్యూరిటి అధికారిగా విధులు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందిన అధికారి ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నాయకులు దేవ శ్రీనివాస్, పోన్నం సదయ్య, బి.శివశంకర్, రామయ్య, సురేష్,రామస్వామి, సదానందం, ముజాఫర్ ఖాన్ పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



జూలపల్లి: రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర సభ్యులు

జూలపల్లి: ఉద్యోగులు, తమ విధులపై అంకితభావంతో పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలని కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ ప్రియాంక జైన్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెండోరోజు కేంద్ర క్వాలిటీ అసూర్యెన్సు టీం సభ్యులు పర్యటించి రికార్డులను, పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో మౌలిక సదుపాయాలు, రోగులకు అందుతున్న సేవలు, మందుల పంపిణీపై పరిశీలించారు. దీంతో కేంద్రం బృందం రెండురోజుల పర్యటన శనివారంతో ముగిసింది. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ మనీష్‌కుమార్, ప్రియాంకజైన్, మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, సీహెచ్‌వో కలీమొద్దీన్, హెచ్‌వీ వసంత, ఎల్‌టీ కిరణ్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ నాయకుల సంబరాలు



రామగిరి: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఆర్జీ–3 డివిజన్‌లో ఐఎన్‌టీయూసీ విజయం సాధించడంపై ఏపీఏ, సెంటనరీకాలనీలో శనివారం డివిజన్ ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. తొలుత విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఏపీఏ, ఓసీపీ–2 ఫిట్ సెక్రటరీలు మంద కొమురయ్య, ఊయ్యల కుమార్‌స్వామి, నాయకులు శర్వాన్, సాయికృష్ణ, రామరావు, జుబేర్, అనిల్, ప్రేమ్‌కుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రం వద్ద తోపులాట



జ్యోతినగర్: మీసేవ కేంద్రం వద్దకు ఆధార్ నమోదు కోసం ప్రజలు అధికంగా రావడంతో తోపులాట చోటుచేసుకుంది. శనివారం ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లోని ప్రభుత్వ అనుబంధ మీసేవ కేంద్రం వద్ద ఉదయం నుంచే ప్రజలు ఆధార్ అప్‌డేట్ కోసం, దరఖాస్తు ఫారాల కోసం క్యూలు కట్టారు. మీసేవ సిబ్బంది కేంద్రాన్ని ఓపెన్ చేయగానే ఒక్కసారిగా ప్రజలు దరఖాస్తు ఫారాల కోసం రావడంతో కొంతసేపు తోపులాట జరిగింది. సిబ్బంది ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో పోలీసులు ప్రజలకు నచ్చజెప్పారు.